క్లుప్తంగా

ఎమ్మెల్సీ పర్యటన.. పనుల పరిశీలన..



వరికోల్‌లో పర్యటిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నడికూడ : ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మండలంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వేములపల్లి నుంచి వరికోల్ వరకు రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులతోపాటు వరికోల్‌లోని కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద కుమారస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన మంద శ్రీనివాస్ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ మ్యాక్స్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన్ను మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం కలిసి పరామర్శించారు. శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్‌కు సూచించారు.

రోడ్డు విస్తరణ పనులు షురూ



శాయంపేట : మండలంలోని శాయంపేట నుంచి ఆత్మకూరు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు గురువారం మొదలయ్యాయి. సదరు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు శాయంపేటలో నిలిచిపోగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు సంబంధిత కాంట్రాక్టర్ పనులను గురువారం చేపట్టగా సర్పంచ్ కందగట్ల రవి ప్రారంభించారు.

సైలానీ బాబా గంధం ఊరేగింపు



ఆత్మకూరు : మండల కేంద్రంలో గురువారం సైలానీ బాబా గంధం ఊరేగింపు ఘనంగా జరిగింది. మహారాష్ట్రకు చెందిన డప్పు చప్పుళ్ల బృందంతో ఊరేగింపు నిర్వహించారు. ఆత్మకూరుకు చెందిన బండి భిక్షపతి ఇంటి వద్ద ఓగ్లాపూర్ సైలానీ బాబా దర్గా పీఠాధిపతి అబ్దుల్ హమీద్ ప్రత్యేక ప్రార్థన చేశారు. గంధంను దర్గాకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బాబా అబ్దుల్ హమీద్ మాట్లాడారు. ఈనెల 12 నుంచి జరగనున్న ఓగ్లాపూర్ సైలానీ బాబా గంధం జాతరను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్కే.మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఉచితంగా కరెంట్ ఇవ్వాలి

శాయంపేట : పేద దళితులందరికీ ఉచితంగా కరెంట్ ఇవ్వాలని బీఎస్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మగ్గం సుమన్ ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా కరెంట్ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మీటర్లు బిగించుకోవాలని హెచ్చరికలు చేస్తూ అక్రమ కరెంట్ వినియోగం పేరుతో కేసులు బనాయించేందుకు తెగబడుతోందని విమర్శించారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేదలకు విద్యుత్ మీటర్లు బిగించి బిల్లు చెల్లించే స్తోమత ఉండదని పేర్కొన్నారు. ప్రభుత్వం పేద దళితులకు ఉచితంగా మీటర్లు అందించి విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

నేడు ఎల్బీ కళాశాల వార్షికోత్సవం

రామన్నపేట : నేడు (శుక్రవారం) వరంగల్‌లోని ఎల్బీ కళాశాల 52వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ తాటికొండ రమేష్, సీపీ రంగనాథ్, టీఎస్జీవోస్ జనరల్ సెక్రటరీ ప్రతాప్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్, సాంస్కృతిక కన్వీనర్ సుధాకర్, కెప్టెన్ సదానందం పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ధ్యేయం

కమలాపూర్ : అంధత్వ నివారణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని మర్రిపల్లిగూడెంలో, ఉప్పల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉప్పలపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను జెడ్పీటీసీ లాండిగె కల్యాణి లక్ష్మణ్‌రావుతో కలిసి ఎంపీపీ తడక రాణి గురువారం ప్రారంభించి మాట్లాడారు. శిబిరాలను సమస్యలున్న వ్యక్తులు వినియోగించుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు చేయించుకుంటే అవసరమైన వారికి మందులతోపాటు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఇనుగాల కిరణ్మయి విజయ్‌కుమార్, బొల్లపెల్లి ఉమ రవీందర్, తహసీల్దార్ రాణి, వైద్యాధికారులు డాక్టర్ హర్షిణీ ప్రియ, డాక్టర్ రేణుక, గిర్దావర్ శ్రీనివాస్, క్యాంప్ కోఆర్డినేటర్ కనకలక్ష్మీ, ఆప్టోమెట్రిస్ట్ హరికృష్ణ, డీఈఓలు ప్రభాకర్, దేవరావు, ఏఎన్‌ఎంలు యూనిస్ మేరీ, సరస్వతి పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండలంలోని సూరారంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ తంగెడ నగేష్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. 15 ఏళ్లకు పైబడిన ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేయడంతోపాటు అవసరమైతే శస్త్రచికిత్స సైతం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, సర్పంచ్ కుర్ర సాంబమూర్తి, వైద్యాధికారి హెక్తేదార్ హైమద్, బ్యాంక్ డైరెక్టర్ తంగెడ మహేందర్, మాజీ ఎంపీపీలు తంగెడ శాలిని, మేకల కోమల, సంపత్‌రావు పాల్గొన్నారు.



కమలాపూర్ : కంటి పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్ కిరణ్మయి

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీఓ చేతన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఏప్రిల్ 3 వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. దగ్గర చూపు బాధితులకు వెంటనే, దూరపు చూపు కోసం ఆర్డర్ పెట్టి ఇంటికే తెచ్చి కళ్లద్దాలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పుష్పలీల, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ నర్సమ్మ, పంచాయతీ కార్యదర్శి జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ నగేష్

సమస్యలపై పోరాటాలు తప్పవు

● కేయూ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్

పరకాల : నాయీబ్రాహ్మణుల సమస్యలపై పోరాటాలు తప్పవని కేయూ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్ స్పష్టం చేశారు. పట్టణంలో నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు తూముల రఘువీర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి సతీష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి నిలబెట్టుకోలేకపోవడం సరికాదన్నారు. ఆలయాల్లో తలనీలాలు తీసే నాయీబ్రాహ్మణులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని, రాష్ట్రంలో 30 వేల ఆధునిక సెలూన్లు ఏర్పాటు చేస్తామన్న హామీలను అమలు చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు పేద నాయీబ్రాహ్మణులకు రూ.5 లక్షలతో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టించాలని, నాయీబ్రాహ్మణ వృత్తిదారులకు రూ.5 వేలు చొప్పున పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐక్యపోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు విజయగిరి సమ్మయ్య, యువశక్తి జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి నిరంజన్, సంఘం మండల అధ్యక్షుడు తూముల బాబు, పట్టణ అధ్యక్షుడు ఐలిపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సతీష్

డాక్టర్ సురేందర్‌రెడ్డి ఔదార్యం



నడికూడ : ప్రముఖ డాక్టర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల సురేందర్‌రెడ్డి తన స్వగ్రామమైన మండలంలోని పులిగిల్లకు కైలాస రథం, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు కుర్చీలు, బెంచీలు, విద్యార్థులకు బెల్టులు, బ్యాగులు అందజేశారు. అలాగే ,గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడంతోపాటు మహిళా కళాకారుల బృందాలకు రూ.50 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలకుర్తి సదానందం తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత



చిన్నారులను అప్పగిస్తున్న పోలీసులు

ఎల్కతుర్తి : తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను వారి కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. ఇద్దరు చిన్నారులు హుజురాబాద్ నుంచి హనుమకొండకు వెళ్లే ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా తప్పిపోయారు. ఈ విషయమై ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై పరమేష్ సిబ్బందితో బస్టాండ్‌కు చేరుకుని చిన్నారులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. చిన్నారులను హుజురాబాద్‌కు చెందిన నల్లగొండ ప్రజ్వల్, వాసాల హన్మంతుగా నిర్ధారించుకుని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో వారికి చిన్నారులను అప్పగించారు. బాలల కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేసి పంపించారు.

కేంద్రానిది బ్లాక్‌మెయిల్ రాజకీయం



శాయంపేట : కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈడీ ద్వారా నోటీసులు జారీ చేయడం ద్వారా బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని పీఏసీఎస్ వైస్‌చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని మైలారంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకే కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మస్కే సదయ్య, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో దళితులపై వివక్ష

దామెర : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితుల పట్ల వివక్ష కొనసాగుతోందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవింద రవికుమార్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై జరుగుతున్న దాడులను ఖండించారు. రాజస్థాన్‌లో దళిత విద్యార్థి కుండలోని నీరు తాగడంతో ఉపాధ్యాయుడు హత్య చేశాడని ఆందోళన వెలిబుచ్చారు. గుజరాత్‌లోని ఓ పాఠశాలలో దళిత విద్యార్థులను ఇతరులకు దూరంగా కూర్చోబెట్టడం సరికాదన్నారు. దళితులకు న్యాయం చేస్తామన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హామీలను నెరవేర్చడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా పార్లమెంటులో వెంటనే బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ఇన్‌చార్జ్ పరిమళ శ్రీధర్, నాయకులు తిరుపతి, రణధీర్, రమేష్, చింటు, సిద్దు, రవికుమార్, గజ్జి ప్రదీప్, ఇసాక్, వెంకటేష్ పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీ కవిత రాజీనామా చేయాలి’

ఆత్మకూరు : ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పర్వతగిరి రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత వెంటనే రాజీనామా చేసి నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆజంజాహి మైదానంలో కలెక్టరేట్ నిర్మించాలి

ఖిలా వరంగల్: వరంగల్ ఆజంజాహి మిల్ మైదానంలో కలెక్టరేట్ సముదాయాన్ని నిర్మించాలని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఎంసీపీఐ (యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ స్మారక భవనంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నగరాన్ని స్మార్ట్ సిటీగా చేస్తామని ప్రభుత్వం చెప్పినా ఇంతవరకు అతీగతీ లేదని విమర్శించారు. జిల్లాలో ఏ ఒక్కరికీ ఇంటి స్థలాలు గానీ ఇల్లు గానీ నిర్మించి ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభించి ఐదేళ్లు అవుతున్నా దానికి మోక్షం కలగడం లేదని వాపోయారు. ఈనెల 12న నర్సంపేట పట్టణ కేంద్రం నుంచి హనుమకొండలోని వరంగల్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర ఉంటుందని తెలిపారు. సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి గడ్డం నాగార్జున, జగదీశ్వర్, మహమ్మద్ ఇస్మాయిల్, నర్సయ్య, మాలి ప్రభాకర్, ఐతం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామాజిక న్యాయమేది?

హన్మకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల ప్రకటనలో బీఆర్‌ఎస్ పాటించిన సామాజిక న్యాయమేదని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ప్రశ్నించారు. ముగ్గురు అగ్రకులాల అభ్యర్థులను ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 50శాతం పదవులు బడుగు, బలహీన వర్గాలకు ఇస్తామని పార్టీ రాజ్యాంగంలో రాసుకున్నామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్.. గతంలో జరిగిన ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపుల్లో, అదేవిధంగా రాజ్యసభ పదవుల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అగ్రకులాలకే పెద్దపీట వేయడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్మోహన్ రెడ్డి.. 18 ఎమ్మెల్సీ ఎన్నికల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 14 పదవులు ఇచ్చి రాజకీయంగా అవకాశం కల్పిస్తే.. ఇక్కడ కేసీఆర్ మాత్రం అగ్రకులాల వారికి అగ్రతాంబూలం వేస్తున్నారని తెలిపారు. త్వరలో ప్రకటించే గవర్నర్ కోటాలోనైనా ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలని సూచించారు.

25న కేయూలో సంఘర్షణ సభ

కేయూ క్యాంపస్: తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభను ఈనెల 25న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు కేయూ జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌ఖన్నా తెలిపారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్ హౌస్‌లో సంఘర్షణ సభ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించలేదని, నిరుద్యోగులను ఎనిమిదేళ్లుగా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. 25న జరగనున్న సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ మంద వీరస్వామి, ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీసీ విద్యార్థి సంఘం, బీఎస్‌ఎఫ్, గిరిజన శక్తి కేయూ ఇన్‌చార్జ్‌లు ఆరెగంటి నాగరాజు, గుజ్జుల శ్రీనివాస్, ఎండి.పాషా, కల్లెపెల్లి ప్రశాంత్, సురేష్‌నాయక్, రమేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్


హసన్‌పర్తి: బీఆర్‌ఎస్ రెండవ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని వంగపహాడ్ గ్రామానికి చెందిన బొమ్మగాని వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు వెంకటేష్‌కు నియామక పత్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ గురువారం అందజేశారు.

పలువురికి సన్మానం

హన్మకొండ అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 49వ డివిజన్‌లోని ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మున్సిపల్ మహిళా సిబ్బంది, మహిళా కార్యకర్తలను కార్పొరేటర్ ఏనుగుల మానస ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ సతీమణి దాస్యం శిరీష, నాయకులు మైమూద, రజిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఉచిత వైద్యసేవలు

దేశాయిపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకంలో సభ్యత్వం తీసుకుని ఉచితంగా వైద్య సేవలు పొందాలని బీజేపీ తూర్పు ఇన్‌చార్జ్ కుసుమ సతీష్ సూచించారు. 13వ డివిజన్‌లో ఆయుష్మాన్ భారత్ ఉచిత నమోదు కేంద్రాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఈ పథకంలో రూ.5లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, కోట సతీష్, అపురూప రజనీష్‌నేత, తుమ్మ రమేష్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం ఇస్తున్న కుసుమ సతీష్

పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. పరకాల పట్టణానికి చెందిన ఒంటేరు మల్లయ్య, ఆత్మకూరు మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన మాదాసి పోచయ్య కొన్నేళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పాటు చేసుకొని ఉంటుండగా జీఓ నెంబర్ 58 ద్వారా మంజూరైన పట్టాలను వారికి హనుమకొండలోని తన నివాసంలో ఎమ్మెల్యే గురువారం అందజేసి మాట్లాడారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. సీఎం కేసీఆర్ పేదలకు ఎల్లవేళలా అండగా ఉంటారన్నారు. పేదలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావడమే సీఎం కేసీఆర్ ధ్యేయమని వివరించారు.



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్

దామెర : ఖాతాదారులందరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని ఎఫ్‌ఎల్సీ కౌన్సిలర్ ఎం.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని బ్యాంకు మిత్రలో నాబార్డు ఆర్థిక సౌజన్యంతో స్థానిక ఏపీజీవీబీ శాఖ ఆధ్వర్యంలో కళాజాత ద్వారా బ్యాంకు సేవలపై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు నుంచి తీసుకున్న వ్యవసాయ, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ (ఎస్‌హెచ్‌జీ) రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే వడ్డీ రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. బంగారంపైనా, వాహన, విద్యా, తదితర రుణ పథకాల గురించి వివరించారు. డిజిటల్ బ్యాంకింగ్, ఏటీఎం వినియోగం వల్ల సమయం ఆదా అవుతుందని చెప్పారు. సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులకు ఓటీపీ, పిన్, ఇతర వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలు తెలియజేయవద్దని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, తదితర పథకాలను అర్హులు వినియోగించుకుని ధీమాగా ఉండాలని చెప్పారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన లేకపోతే వడ్డీ రాయితీ, ఇతరత్రా ప్రయోజనాలు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. అనంతరం కేఏస్ రూరల్ మీడియా కళాబృందం సభ్యులు కే.చిదంబరం, కే.ప్రేమ్‌బాబు ఇంద్రజాల ప్రదర్శన, జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. సమావేశంలో బ్యాంక్ అకౌంటెంట్ రంజిత్, బ్యాంకు మిత్ర ఆలేటి రాధిక తదితరులు పాల్గొన్నారు.

‘దేవాదుల’ నుంచి సాగునీటి విడుదల

ఎల్కతుర్తి : వేసవి కాలం ప్రారంభమైన సందర్భంగా పంట పొలాలు ఎండిపోకుండా దేవాదుల రిజర్వాయర్ నుంచి నార్త్ కెనాల్ కాలువ ద్వారా మండలంలోని వివిధ మెట్ట ప్రాంతాలకు సాగునీటిని జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. చెరువులు, కుంటలు నింపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, మునిగడప శేషగిరి, గొడిశాల సమ్మయ్య గౌడ్, చెవుల కొమురయ్య, లోకిని సూరయ్య, వెంకటేష్ యాదవ్, గొడిశాల వినయ్ గౌడ్, కుర్ర సాంబమూర్తి, బొంకూరి భద్రయ్య, జూపాక జడ్సన్ తదితరులు పాల్గొన్నారు.



సాగునీటిని విడుదల చేస్తున్న సుధీర్‌కుమార్

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, తదితరులు

ఐనవోలు : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు మండలం నుంచి 8 మంది విద్యార్థులు ఎంపికై నట్టు గురువారం విడుదలైన ఫలితాల ద్వారా తెలిసింది. మండలంలోని ఒంటిమామిడిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు శివాణి, కౌశిక్, రితీష్, వరుణ్, స్వాతిముత్యం, పార్థు, రిజ్వానాతోపాటు ఐనవోలు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి రాయపురం అశోక్ తేజ ఎంపికయ్యారు. స్కాలర్‌షిప్ కోసం 8వ తరగతి విద్యార్థులు డిసెంబర్‌లో పరీక్షకు హాజరు కాగా ఫలితాలు విడుదలయ్యాయి. సదరు విద్యార్థులకు 2023–24 విద్యాసంవత్సరం నుంచి వరుసగా నాలుగేళ్లపాటు ఏటా రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందనుంది. విద్యార్థులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) చైర్మన్ పొన్నాల రాజు, సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ ఆకస్మిక తనిఖీ

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ.బారీ గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్‌క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులకు సూచనలు అందించారు. విధి నిర్వహణలో ప్రజలతో మమేకం కావాలని సూచించారు. శాంతిభద్రతలకు ఆటంకం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్సై పరమేష్ ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ ఎంఏ.బారీ